## దరఖాస్తులు ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 12 : ప్రతిభ, సేవలకు గుర్తింపుగా సంక్రాంతి విశిష్ట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఈ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు మంగళవారం తెలిపారు. సర్వేజనా సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సమాజసేవ, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, విద్య, వైద్యం,యోగ, కరాటే, మెమోరీ పవర్ రంగాల్లో ప్రతిభ, సేవలు తెలియజేసే వివరాలు కోరారు. ఆయా కాపీలు జతచేస్తూ డిసెంబర్ 25 లోపు 9652347207 లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన వారికి జనవరి 7న నగరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు నారాయణ మాస్టారు వెల్లడించారు.

## ఇబ్బందులు కల్గించవద్దు



గ్యాస్ ఏజెన్సీల వారు ప్రజలకు ఇబ్బందులు కల్గించవద్దని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం షేక్‌పేట్‌లోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ, లంగర్‌హౌస్ రింగ్ రోడ్‌లోని అజిత్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల్లో ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. కేవైసీ కారణంగా వినియోగదారులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదులకు ఎమ్మెల్యే స్పందించి నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి పర్యటించారు. ఎమ్మెల్యే ఏజెన్సీల వారికి పలు సూచనలు చేశారు.

**- మెహిదీపట్నం, డిసెంబర్ 12**

## 17న ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 12 : అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో 17 ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు – 2023 నిర్వహిస్తున్నట్లు ఆటా వేదిక లిటరరీ కమిటీ చైర్ వేణు నక్షత్రం మంగళవారం తెలిపారు. ఆటా సాహిత్య ప్రయాణం – శ్రవణం – భాషణం – పఠనం – లేఖనం అంశాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. సదస్సులను సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ నందిని సిధారెడ్డి, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మీడియా రంగం, అనువాదం – నాటకం – అవధానం, తెలుగు కథ, నవల –విశ్లేషణ, ఆధునిక కవితా వికాస పరిణామాలు, గేయం, సినిమా సాహిత్య మేళవింపు అంశాలపై ఆయా రంగాల ప్రముఖులు విశ్లేషిస్తారన్నారు.

## జనవరి 22ను సెలవుగా ప్రకటించాలి



అయోధ్య రామమందిరం ప్రారంభం, పునః ప్రాణ ప్రతిష్ఠ రోజైన 2024 జనవరి 22ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, తి.తి.దే. ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు స్వామి కమలేశ్ మహారాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అయోధ్య రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్‌దాస్, కార్యదర్శి చంపత్‌రాయ్‌ను వేర్వేరుగా కలిసి ఏర్పాట్లపై చర్చించారు. ఉచితంగా రైళ్లు, బస్సులను నడపాలని అభ్యర్థించారు. **- సుల్తాన్‌బజార్, డిసెంబర్ 12**

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గోల్కొండ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా సూచించారు. మంగళవారం సిబ్బంది స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి దవాఖాన పరిసరాలను శుభ్రం చేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బాధ్యతతో పాల్గొనాలన్నారు. దవాఖానలో అన్నిరకాల వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. **- మెహిదీపట్నం, డిసెంబర్ 12**

# అభివృద్ధిలో భాగస్వాములు కండి

- **ఆస్తిపన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి**
- **బకాయిలను సకాలంలో చెల్లించాలని అధికారుల విజ్ఞప్తి**



జీహెచ్‌ఎంసీ భవనం, అబిడ్స్

అబిడ్స్, డిసెంబర్ 12 : ఎన్నికల హడావుడి అనంతరం జీహెచ్‌ఎంసీ అధికారులు ఆస్తి పన్ను వసూలుపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య నేతృత్వంలో పన్ను వసూలును వేగిరం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సర్కిల్ కార్యాలయం పరిధిలో 75 వేల మంది అసెస్‌మెంట్‌దారులు ఉండగా అందులో బకాయి పడిన వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. గతేడాది పన్ను చెల్లించి ఈ సంవత్సరం ఇప్పటి వరకు పన్ను చెల్లించని వారి వివరాలను సేకరించి వారికి ఫోన్ చేసి పన్ను చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రూ.10 లక్షలకు పైగా బకాయి పడిన వారి వివరాలను సేకరించి వారికి సమాచారం ఇస్తున్నారు. గతేడాది రూ.74 కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా ఈసారి అంతకు మించి వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. సర్కిల్ కార్యాలయం పరిధిలో బకాయి పడిన భవన యజమానులను గుర్తించి వారు సకాలంలో చెల్లించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రే ఆదేశాల మేరకు డీసీ బాలయ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శైలజ నేతృత్వంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్లు వసూలును వేగిరం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందిని రంగంలోకి దింపి పన్ను వసూలు చేపట్టేందుకుగాను ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బకాయి పడిన ఆస్తి పన్నును మార్చి 31 లోపు వసూలు చేసేందుకుగాను చర్యలు చేపడుతున్నారు. సర్కిల్ కార్యాలయం పరిధిలో అధికంగా ప్రభుత్వ భవనాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండడంతో ఆయా భవనాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల నుంచి పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్నాయి.

### చెల్లింపులు ఆన్‌లైన్‌లో కూడా ..

ఆస్తిపన్ను ఆన్‌లైన్ చెల్లింపులు కూడా సాగుతున్నాయి. ప్రజలు తమ ఆస్తి పన్నును ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకుంటున్నారు. ఆస్తి పన్ను చెల్లింపు విషయమై అధికారులు విస్తృత ప్రచారం చేపడుతుండడంతో ఆస్తి పన్ను బకాయి పడిన వారు తమ ఆస్తి పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేపడుతున్నారు. రోజు వారి కార్యకలాపాలతో పాటు ఆస్తి పన్ను వసూలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజలలో అవగాహన తీసుకు వచ్చేందుకు పాటు పడుతున్నారు. కొన్ని నెలలుగా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న జీహెచ్‌ఎంసీ అధికారులు పన్ను వసూలుపై దృష్టి కేంద్రీకరించి తమ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారు. పన్ను బకాయి పడిన వారందరికీ ఫోన్లు చేసి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బకాయిలను చెల్లించాలని కోరుతున్నామని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శైలజ తెలిపారు.

## గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ హుండీ లెక్కింపు

మెహిదీపట్నం, డిసెంబర్ 12 : ఆషాఢ బోనాలకు సంబంధించి గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ ఆలయం హుండీని మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ రాజు, ఇన్‌స్పెక్టర్ సురేందర్ ఆధ్వర్యంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆరెళ్ల జగదీశ్‌యాదవ్, కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబా చారి కార్యక్రమంలో పాల్గొన్నారు. నాలుగు నెలలకు సంబంధించి రూ.1,10,180 వచ్చాయని ఈవో తెలిపారు.

## సమస్యలు పరిష్కరిస్తాం



ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ అన్నారు. ఎమ్మెల్యేను మంగళవారం ఆసిఫ్‌నగర్ డివిజన్ సయ్యద్ అలీగూడ ఎంఐఎం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి ఎండీ.మూసా, ఏరియా ప్రెసిడెంట్ సయ్యద్ అహ్మద్ రజ్వీమాజీద్, నాయకులు సయ్యద్ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

**- మెహిదీపట్నం, డిసెంబర్ 12**

## నకిలీ ఐడీ కార్డులపై ఫిర్యాదు

అబిడ్స్, డిసెంబర్ 12 : తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం విషయమై కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ మీ సేవా కేంద్రాల్లో రూ.200 తీసుకొని నకిలీ ఐడీ కార్డులు అందజేయడంపై బేగంబజార్ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎం. బద్రినాథ్ షాహినాయత్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

అబిడ్స్, డిసెంబర్ 12 : గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహాన్ని అబిడ్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 65–70 ఏండ్ల ఓ వృద్ధుడి మృతదేహం నాంపల్లిలోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు.




## కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి దవాఖాన ఆవరణలో నినాదాలు చేస్తున్న న్యాయవాది వహీద్ అహ్మద్ **- అబిడ్స్, డిసెంబర్12**

## నేడు మల్లు రవికి మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారం

రవీంద్రభారతి, డిసెంబర్ 12 : శ్రుతిలయ, సీల్‌వెల్ మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారం – 2023ను రాజకీయవేత్త, సేవామూర్తి, అజాత శత్రువు మాజీ ఎంపీ మల్లు రవికి 13వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రవీంద్రభారతి మెయిన్‌హాల్‌లో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నట్లు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ బి.భీంరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విచ్చేయనున్నారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ పాల్గొంటారని తెలిపారు.

## అల్పాహారం అందజేత



మృగశిర అమావాస్యను పురస్కరించుకొని కోఠిలోని ప్రసూతి దవాఖానలో రోగులకు వారి సహాయకులకు తెలంగాణ బజరంగ్ సేనా అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు, శ్రీనివాస్ గుప్త, మనోజ్, నరేశ్, రాఘవ కుమార్, నందు, శ్రీనివాస్, గణేశ్ సింగ్ అల్పాహారం అందజేశారు.

**- అబిడ్స్, డిసెంబర్12**

# అక్కినేని దర్శక ప్రతిభా పురస్కారాలు ప్రదానం



అక్కినేని దర్శక ప్రతిభా పురస్కారం అందజేస్తున్న వక్తలు

రవీంద్రభారతి, డిసెంబర్ 12 : సాంస్కృతిక కళా బంధు సారిపల్లి కొండల్‌రావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో దాదాసాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా సినీ ప్రముఖులకు అక్కినేని దర్శక ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కొండల్‌రావు సభా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పూర్వ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి.శేషశయనారెడ్డి, విశిష్ట అతిథిగా నిర్మాతలు ఎన్.ఆర్.అనురాధా దేవి, అచ్చిరెడ్డి, జి.వి.నారాయణ విచ్చేశారు. సినీప్రముఖులు రేలంగి నరసింహారావు, ముత్యాల సుబ్బయ్య, అల్లాణి శ్రీధర్‌కు ప్రతిభాపురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, ఎస్.వి. రామారావు పాల్గొన్నారు.

## ఉచిత ప్రయాణ పథకం బాగుంది



లంగర్‌హౌస్‌లో మంగళవారం ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ నాయకులు మహిళలతో ఉచిత ప్రయాణంపై మాట్లాడారు. ఉచిత ప్రయాణ పథకం బాగుందని మహిళలు తెలిపారని కార్వాన్ నియోజకవర్గం ఏ – బ్లాక్ అధ్యక్షుడు కూరాకుల కృష్ణ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎ.చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**- మెహిదీపట్నం / కార్వాన్, డిసెంబర్ 12**